క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల దినోత్సవంగా జరపాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల దినోత్సవంగా నిర్వహించాలని డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కుమార్ పిలుపునిచ్చారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కేక్ కట్ చేయాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వ్యవస్థాపక అధ్యక్షుడు నూతన్ కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, బి.సతీష్, ఎం.శేషుబాబు తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా సుపరిపాలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బి. జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తుంపాల వరప్రసాద్, మార్తి చంద్రమౌళి, అక్బర్, పవన్ కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, డి.దుర్గారావు, ఎస్.రామకృష్ణ, డి.కృష్ణ, నగర ప్రసాద్ పాల్గొన్నారు.

సందడిగా పిల్లల పండుగ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న 6వ అమరావతి బాలోత్సవం రెండో రోజైన బుధవారం సందడిగా సాగింది. సీనియర్స్ విభాగం విద్యార్థులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. జూనియర్స్ విభాగంలో విచిత్ర వేషధారణ, జూనియర్స్ లఘు నాటిక, సీనియర్స్ విభాగంలో క్లాసికల్, సీనియర్స్ దేశభక్తి గీతాలాపన, సబ్ జూనియర్స్ విభాగంలో కథలు చెప్పడం నిర్వహించారు. జూనియర్స్ పద్యం భావం చెప్పడం, తెలుగులో మాట్లాడడం, చిత్రలేఖనం, వ్యాసరచన, స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.



నేడు బహుమతుల ప్రదానోత్సవం..

మూడు రోజుల పాటు జరిగిన బాలోత్సవంలోని వివిధ పోటీల్లో విజేతలకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహిస్తామని అమరావతి బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు.

దేశం గర్వించదగ్గ సీఎం మన జగనన్న

సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో వక్తలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భూమ్మీద ప్రతి దానికి ఓ చరిత్ర ఉంటుందని, కాలం గురించి చెప్పేముందు క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం అని ఎలా అయితే చెబుతామో రేపటి రానున్న తరం కూడా మన రాష్ట్రం గురించి, ముఖ్యమంత్రి హోదా గురించి చెప్పాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముందు, తరువాత అనే విధంగా చరిత్ర చెప్పుకుంటారని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్వీ జానారెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు సింగ్‌నగర్ షాదీఖానాలో బుధవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, క్రైస్తవ సంఘాల పెద్దలు, పాస్టర్లు పాల్గొని కేకు కట్ చేశారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు

అనంతరం క్రిస్మస్ పండుగ సందర్భంగా సెంట్రల్‌లోని చర్చిల పాస్టర్లకు నూతన వస్త్రాలు బహూకరించి, ప్రేమ విందు ఏర్పాటు చేశారు. క్రైస్తవ మత పెద్దలు ప్రభాకర్, రత్నబాబు, రెవరెండ్ మేంగలపూడి జోసఫ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్నేహం పేరుతో చీటింగ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్నేహం పేరుతో పరిచయమైన ఓ వ్యక్తి తన తండ్రికి ఆరోగ్యం బాలేదని నమ్మించి తన వద్ద నుంచి 64 గ్రాముల బంగారం, 33 వేల రూపాయల నగదు తీసుకొని మోసం చేశాడని ఓ యువతి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ నందమూరినగర్‌కు చెందిన యువతి ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. ఏడాది క్రితం పీవీపీ మాల్‌కు వెళ్లగా అక్కడ హేమంత్ మణికంఠ అనే యువకుడు పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేవాడు. ఈ ఏడాది మార్చి నెలలో ఫోను చేసిన అతను తన తండ్రికి ఆరోగ్యం బాలేదని వెంటనే డబ్బులు కావాలని చెప్పడంతో తన ఒంటిమీద ఉన్న రెండు బంగారపు చైన్లను యువతి తీసి ఇవ్వగా మరుసటి రోజు వాటిని తిరిగి ఇచ్చేశాడు. మళ్లీ కొన్ని రోజులు గడిచాక మా నాన్నకు సీరియస్‌గా ఉందని, ఐసీయూలో పెట్టారు వెంటనే డబ్బులు కావాలని ఫోను చేయగా యువతి తనకు సంబంధించిన 64 గ్రాముల బంగారం, రూ.33 వేల నగదును ఫోన్‌పే ద్వారా హేమంత్‌కు పంపింది. ఆ తరువాత బంగారం కోసం, డబ్బుల కోసం ఫోన్లు చేస్తుండగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. మోసపోయినట్లు భావించిన ఆమె పోలీసులను ఆశ్రయించింది.

అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అధ్యాపకులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ గురువారంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధికి దిక్సూచి రహదారులు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్లో రూ.39.84 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రోడ్లను నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, జానారెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతానికి జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పరిచయం చేసిందన్నారు. ఇప్పటి వరకు డివిజన్లో రూ.8.41 కోట్ల అభివృద్ధి మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈ (ఇంజినీరింగ్)శ్రీనివాస్, డీఈ గురునాథం, నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు పెద్ద పీట

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ జీవీఆర్ నగర్‌లో రూ. కోటి 20 లక్షల వ్యయంతో జరుగుతున్న అంతర్గత రహదారుల నిర్మాణ పనులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బి. జానారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు.

స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): లక్ష్మీనారాయణులకు అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసంలో తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో పూజలు, పారాయణం చేస్తున్న ప్రతి ఒక్కరికీ స్వామివారి అనుగ్రహం తప్పక లభిస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పారాయణంలో ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. దాత, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, వెంకటరమణ దంపతులు పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

22 నుంచి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 22వ తేదీ నుంచి రెండు రోజుల పాటు సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ తెలిపారు. వీటికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆ పాఠశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు సంబంధించిన కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి మండలం నుంచి వచ్చిన ప్రాజెక్టుల నుంచి ఉత్తమమైన తొమ్మిది ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపుతామని తెలిపారు. ఇప్పటికే మండల స్థాయి పోటీలను దిగ్విజయంగా పూర్తిచేశామని పేర్కొన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శనను కూడా విజయవంతం చేయాలని కోరారు.

అమర జవాన్ల కుమార్తెలకు ల్యాప్‌టాప్‌ల వితరణ

విజయవాడస్పోర్ట్స్: యుద్ధంలో అమరులైన జవాన్ల కుమార్తెలకు అధర్వ ఫౌండేషన్ సభ్యులు ప్రొఫెసర్ సందీప్ గొండే, ప్రొఫెసర్ బాలాజీ షిండే ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అధర్వ ఎడ్యుకేషన్ ట్రస్ట్, అధర్వ ఫౌండేషన్ చైర్మన్, బోరవాలి(ముంబై) శాసన సభ్యుడు సునీల్ రాణే సమకూర్చిన ల్యాప్‌టాప్‌లను విజయవాడలోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వారు బుధవారం అందజేశారు. యుద్ధంలో అమరులైన ఐదుగురు జవాన్ల కుమార్తెలకు ఒక్కొక్కరికీ ఒక్కో ల్యాప్‌టాప్‌ను అందజేయడం పట్ల బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ దేశభక్తి స్ఫూర్తిని కొనియాడారు. సైనిక కుటుంబాల తరుపున ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



‘ఆడుదాం ఆంధ్రా’ విజయవంతానికి సమష్టి కృషి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాన్ని విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, క్రీడాభివృద్ధి అధికారులు, స్పోర్ట్స్ అంబాసిడర్స్‌తో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎస్‌డీవో అజీజ్, జిల్లా స్పోర్ట్స్ అంబాసిడర్లు అనూష(సాఫ్ట్ టెన్నిస్), అబ్దుల్ రజాక్(ఫుట్‌బాల్)లతో కలిసి హాజరయ్యారు. క్రీడోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు స్థానిక ప్రాధాన్యమున్న క్రీడలకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్, మైదానాల ఎంపిక, టీమ్ ఫార్మేషన్, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ తదితర ప్రక్రియను సజావుగా చేపట్టినట్లు వెల్లడించారు. క్రీడల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆడుదాం ఆంధ్రాలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు, క్రీడాకారులు

ఎస్‌ఎస్‌ఎం స్కూల్ స్వర్ణోత్సవాలు ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని ఎస్‌ఎస్‌ఎం స్కూల్ స్వర్ణోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు పాఠశాల ప్రైమరీ విభాగం స్వర్ణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రావెన్స్ ప్రావెన్షియల్ సుపీరియర్ షైన్ అలెక్స్, పాఠశాల పూర్వ విద్యార్థి, అమెరికాకు చెందిన టీఏవో డిజిటల్ సొల్యూషన్స్ అధినేత వెలగపూడి రాజ్‌కుమార్, పీవీపీ వెంచర్స్ ఎండీ పొట్లూరి వరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుడా సాంస్కృతిక అంశాలు, క్రీడలు తదితర విభాగాల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. పొట్లూరి వరప్రసాద్(పీవీపీ) మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన రిథమ్ ఆఫ్ జాయ్, విభిన్న సంస్కృతులను వివరించిన ఏస్టార్ వాజ్ బార్న్ నృత్యం, స్ప్రింగింగ్ పార్క్స్, విద్యార్థులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అసిస్టెంట్ జనరల్ బ్రదర్ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, కరస్పాండెంట్ మౌంట్‌ఫోర్ట్ పాల్గొన్నారు.



వేడుకగా చిన్నయ సూరి జయంతి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశీలి పరవస్తు చిన్నయ సూరి అని పరవస్తు చిన్నయ సూరి సాహితీపీఠం వ్యవస్థాపకుడు టి. శోభనాద్రి అన్నారు. చిన్నయసూరి సాహితీపీఠం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో బుధవారం చిన్నయసూరి 217వ జయంతి సభ నిర్వహించారు. సాహితీవేత్తలు చిన్నయ సూరి సాహితీసేవలను వివరించారు. చిన్నయ్య సూరి జయంతి సందర్భంగా తెలుగు భాషా సేవకుడు డాక్టర్ గుమ్మాసాంబశివరావుకు పరవస్తు చిన్నయ సూరి స్మారక పురస్కారం అందించారు. కె. అనిల్‌కుమార్ సూరి, టి. శ్రీనివాసులు, వరయూరి మధుసూదనరావు, బీఆర్‌బీ ప్రసాద్, ఎంఎస్‌పీ ప్రసాద్, మోక్షం నాగలక్ష్మి, తొండా కనకదుర్గాదేవిలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

మాస్టర్ అథ్లెట్‌లు నేటి యువతకు ఆదర్శం

విజయవాడస్పోర్ట్స్: వృద్ధాప్యంలోనూ చురుగ్గా క్రీడల్లో పాల్గొంటూ పతకాలు సాధించి రాష్ట్ర, జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న మాస్టర్ అథ్లెట్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలని హెర్బల్ లైఫ్ ఫర్‌ఫెక్ట్ న్యూట్రీషియన్ సెంటర్ మేనేజర్ అనీల్‌కుమార్ అన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన 44 మంది మాస్టర్ అథ్లెట్‌లు పలు విభాగాల్లో 77 పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ అథ్లెట్‌లను సూర్యారావుపేటలోని అమ్మన ఎస్టేట్‌లో హెర్బల్ లైఫ్ ఫర్‌ఫెక్ట్ న్యూట్రీషియన్ సెంటర్ ప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి.ప్రసాదరావు, న్యూట్రీషియన్ సెంటర్ సభ్యులు జి. సుశీలరావు, ఎం. శంకర్ పాల్గొన్నారు.

రామకృష్ణాపురం చేరుకున్న పవిత్ర అక్షింతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలు బుధవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యాన రామకృష్ణాపురం సీతారామ భక్త హనుమాన్ ఆలయానికి చేరుకున్నాయి. ఆలయంలో పూజలు నిర్వహించి మేళ తాళాలతో రామకృష్ణాపురం బుడమేరు వంతెన సమీపంలోని శ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ పవిత్ర అక్షింతలు జనవరి 1వ తేదీ నుంచి భక్తులకు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కీసర ఓంకార్ రెడ్డి, రాఘవరాజు, శర్మ, బాలాజీ పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా కేఆర్‌జీ శేషుకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాహిత్య, సాంస్కృతిక, కళా సంస్థ ‘శ్రీశ్రీ కళావేదిక’ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తెలుగు అధ్యాపకుడు, రచయిత డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ నియమితులయ్యారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా శేషుకుమార్‌ను పలువురు సాహిత్య అభిమానులు, అధ్యాపకులు అభినందించారు.



